

కన్నుల పండువగా మల్లికార్జునుడి శోభాయాత్ర




4

శంభో శంకరా..

- నేడు మహాశివరాత్రి
- ముస్తాబైన ఆలయాలు

మహాశివరాత్రి పర్వదినానికి శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. జిల్లాలోని ఓదెల మల్లికార్జున స్వామితోపాటు పలు ఆలయాల్లో వేడుకలు వైభవంగా జరగనున్నాయి. ఆలయాల్లో శివ కల్యాణం జరపనున్నారు. అలాగే భక్తులు గోదావరి స్నానాలను ఆచరిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్ష ఆచరిస్తారు. సాయంత్రం దీపారాధన అనంతరం పండ్లు తీసుకుంటారు. అనంతరం రాత్రి జాగారం ఉండి మరుసటి రోజు ఉపవాసం విరమిస్తారు. పండుగ సందర్భంగా మార్కెట్లలో రద్దీ నెలకొంది. పూజ సామగ్రి, పండ్లు, ప్రమిదలు కొనుగోలు చేశారు. బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ దర్శనానికి ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.



6



ముస్తాబయిన కోదండ రామాలయంలోని శివాలయం

- హోరాహోరీగా ముగిసిన ఎమ్మెల్సీ ప్రచారం
- రేపు పోలింగ్
- జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 31,037 మంది, 36 పోలింగ్ బూత్‌లు
- ఉపాధ్యాయ ఓటర్లు 1,111, పోలింగ్ కేంద్రాలు 14

ప్రచారానికి తెర.. ప్రలోభాలతో ఎర..



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 4 గంట లకు ముగిసింది. కొందరు అభ్యర్థులు ప్రలోభాలకు తెర తీస్తున్నారు. ఓటుకు నోటు ఇచ్చి వారి ఓట్లను తమ ఖాతాలో వేసుకుని విజయం సాధించాలని భావిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక అభ్యర్థి ఓటర్‌కు రూ.5 వేల చొప్పున పంపిణీ చేశారనే ప్రచారం జరుగుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కూడా ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులు ఓటుకు నోటు ఇచ్చేం దుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు జిల్లా అధికార యంత్రాంగం పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 56 మంది అభ్యర్థులు పోటీ చేస్తు న్నప్పటికీ ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి పులి ప్రసన్న హరికృష్ణ గౌడ్, ఏఐఎఫ్‌బీ పార్టీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్, స్వతంత్ర అభ్యర్థులు యాదగిరి శేఖర్ రావు, మహ్మద్ ముస్తాక్ అలీ, డాక్టర్ బండారి రాజ్‌కుమార్ విస్తృత ప్రచారం నిర్వహించారు. సభలు, సమావేశాలతో పాటు పోస్టర్లు, కరపత్రాలు, ఫ్లెక్సీలతో ప్రచారం చేశారు. ఓటర్ల సెల్‌ఫోన్లకు వాయిస్ రికార్డు కాల్స్‌తోపాటు ఎస్ఎంఎస్‌లు పంపించారు. ఫోన్లు చేసి మాకే మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఊదర గొడుతున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 15 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ప్రధానంగా వంగ మహేందర్‌రెడ్డి, మల్క కొమురయ్య, రఘోత్తమ్ రెడ్డి, అశోక్‌కుమార్‌లు ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ ఎన్నికల్లో ఈసారి ప్రైవేట్ విద్యాసంస్థల్లో పని చేసే ఉపాధ్యాయులకు సైతం ఓటు హక్కు కల్పించడంతో ఈ ఎన్నిక రసవత్తరంగా మారింది. ఒకప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయుల మధ్యనే ఈ ఎన్నిక జరిగేది. ఎక్కువగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మాత్రమే పోటీ చేసే వాళ్లు. వారికి అవసరాన్ని బట్టి ఆయా రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించేవి. ప్రైవేట్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించడంతో బీజేపీ నుంచి జిల్లాకు చెందిన మల్క కొమురయ్య బరిలో నిలిచి ఇతర అభ్యర్థులకు గట్టి పోటీనిచ్చారు. పట్టభద్రుల ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, అంజిరెడ్డిల మధ్యనే ప్రధానంగా పోటీ నెలకొన్నది. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి, మంథని ఎమ్మె ల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నది. మార్చి 3వ తేదీన కరీంనగర్‌లో కౌంటింగ్ నిర్వహించ నున్నారు.

జిల్లాలో మండలాల వారీగా పట్టభద్రుల, ఉపాధ్యాయ ఓటర్లు..

మండలం	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
1. పెద్దపల్లి	5101	257
2. కాల్వశ్రీరాంపూర్	1538	21
3. ఓదెల	1796	50
4. సుల్తానాబాద్	3459	127
5. ఎలిగేడు	882	13
6. జూలపల్లి	1198	13
7. ధర్మారం	2070	67
8. అంతర్గాం	549	12
9. పాలకుర్తి	1070	7
10. రామగుండం	8354	373
11. మంథని	2121	92
12. ముత్తారం	754	17
13. రామగిరి	1278	42
14. కమాన్‌పూర్	867	20
మొత్తం	31037	1111

జిల్లాలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 3,55,159 ఉండగా, ఇందులో పురుషులు 2,26,765 మంది, మహిళలు 1,28, 392 మంది ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 27,088 ఉండగా, పురుషులు 16,932 మంది, మహిళలు 10,156 మంది ఉన్నారు.

పెద్దపల్లి జిల్లాలో పట్టభద్రులు 31,037 మంది ఓటర్లు ఉండగా పురుషులు 19,008 మంది, మహిళలు 12,028 మంది, ఇతరులు ఒకరు ఉన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 13,974 మంది, మంథని నియోజకవర్గంలో 5,020 మంది, రామగుండం నియోజకవర్గంలో 9,973 మంది, ధర్మపురి నియోజకవర్గం పరిధిలోని ధర్మారం మండలంలో 2,070 మంది ఓటర్లు ఉన్నారు. పట్టభద్రులకు సంబంధించి 36 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయ ఓటర్లు 1,111 ఉండగా, పురుషులు 647 మంది, మహిళలు 464

మిగతా 6వ పేజీలో...

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలను పెంచాలి



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం అడ్డగుంటపల్లిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. గర్భిణీలకు ప్రసవాలు ఎప్పుడు జరుగుతాయో అంచనా వేస్తూ వివరాలు నమోదు చేయాలని, ప్రసవానికి సమీపంలో ఉన్న గర్భిణీలతో మాట్లాడి ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం జరిగేలా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందించే విధంగా చర్యలు చేపట్టాలని, ప్రసవాల సమయంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, ఆసుపత్రికి వచ్చే షుగర్, బీపీ రోగులను పరీక్షలు చేసి వారికి మందులను అందించాలని సూచించారు. ఆరోగ్య కేంద్ర పరిధిలో టీబీ అనుమానితులందరికి నిర్ధారణ పరీక్షలు జరిగేలా చూడాలని, ఎన్‌సీడీ సర్వే పూర్తి చేసి అబా కార్డులను జనరేట్ చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) అరుణశ్రీ, ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి మాణికేశ్వర్‌రెడ్డి, సూపర్‌వైజర్ అనిత ఉన్నారు.

మార్చి20లోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో మార్చి 20వ తేదిలోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం టీయూఎఫ్ఐడీసీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్‌లో రూ.29కోట్ల అంచనాలతో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. పనుల్లో వేగం పెంచాలని, నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. జీఎం కాలనీ సమీపంలో రాజీవ్ రహదారి నుంచి ఐబీ కాలనీ వరకు నిర్మిస్తున్న డ్రైన్‌ను పరిశీలించారు. కాంట్రాక్టర్లు పనులు వేగంగా చేస్తున్నందున వారి బిల్లులు కూడా త్వరితగతిన రికార్డు చేయాలన్నారు. ఆధునీకరణ తరువాత నాలాల భూములను పరిరక్షించాలని, నాలాల పక్కన వాకింగ్ ట్రాక్‌లు నిర్మించాలని ఆదేశించారు. టీబీ శిబిరాన్ని పరిశీలించారు. జనం అధికంగా గుమిగూడకుండా ప్రణాళికబద్ధంగా పరీక్షలు నిర్వహించాల న్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మున్సిపల్ ఎస్ఈ శివా నంద్, ఈఈ రామన్, ప్రైమరీ హెల్త్ వైద్యాధికారి మాణికేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుందనపల్లి అర్బన్ పార్కును సందర్శన

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి శివారులో గల అర్బన్ ఫారెస్ట్ పార్కును మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష సందర్శించారు. కలెక్టర్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. సందర్శకుల సంఖ్య పెరిగేలా మరిన్ని మొక్కలు నాటాలని జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్యను ఆదేశించారు. గేట్ ఆర్చ్, వాకింగ్ ట్రాక్ పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి నాగయ్య, సారేదార్ ఎండీ రహ్మతుల్లా, ఎండీ ఇర్షద్, అటవీశాఖ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



టీబీ సెంటర్, అర్బన్ పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి సంబంధించి 36 లొకేషన్‌లలో 108 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయన్నారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా 15 లొకేషన్‌లలో 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, మంచిర్యాల జిల్లాలో 21 లొకేషన్‌లలో 58పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. అన్నీ పోలింగ్ స్టేషన్లకు నంబర్ మార్క్, వెబ్ కాస్టింగ్ జియో ట్యాగింగ్ పూర్తి చేశామన్నారు. 19 రూట్ మొబైల్స్, 17స్ట్రైకింగ్ ఫోర్స్, 5 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 7ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ టీములు ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. ఐదుగురు ఏసీపీలు, 21మంది సీఐలు, 37మంది ఎస్ఐలు, 117మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 198మంది కానిస్టేబుళ్లు, 17 ఆర్మ్‌డ్ సెక్షన్లు, 78 మంది హోంగార్డులు 500మంది సిబ్బంది బందోబస్తులో ఉంటారన్నారు. సర్కిళ్ల పరిధిలో సీఐలు, డివిజన్ల పరిధిలో ఏసీపీలు బందోబస్తును పర్యవేక్షిస్తారన్నారు.

బీఎన్ఎస్ఎస్ 163సెక్షన్ అమలు

ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీపీ శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 25వ తేది సాయంత్రం 4గంటల నుంచి 28వ తేది ఉదయం 8గంటల వరకు కమిషనరేట్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల చుట్టూ ఈ సెక్షన్ అమలులో ఉంటుందని, ఐదుగురు, అంతకన్నా ఎక్కువ మంది గుంపుగా తిరగవద్దన్నారు. పార్టీ జెండాలు, గుర్తులు, ప్లకార్డులు ప్రదర్శించవద్దన్నారు. మైకులు, లౌడ్ స్పీకర్లు వాడవద్దని, పాటలు, ఉపన్యాసాలు ఇవ్వవద్దన్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, బాణాసంచా కాల్చడం వంటివి నేరంగా పరిగణిస్తామన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన న్యాయవాది నామ్‌తాబాద్ కిరణ్‌జీపై వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి దురుసుగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ మంగళవారం గోదావరిఖని కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కోర్టు ముందు నిరసన తెలిపారు. సీఐపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): న్యాయవాది నంతాబాద్ కిరణ్ జీపై గోదావరిఖని పోలీసులు దురుసుగా ప్రవర్తించిన తీరును నిరసిస్తూ సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ప్రధాన కార్యదర్శి జోగుల రమేష్‌తో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలు

- శివరాత్రి పండుగ ఎఫెక్ట్
- పండ్లు, కూరగాయల ధరలు రెట్టింపు



కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందు బాటులో ఉన్న కూరగాయల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. పండుగ సందర్భంగా గ్రామాల నుంచి కూరగాయలు రాకపోవడంతో డిమాండ్ ఏర్పడింది. పండుగకు రెండు రోజుల ముందు, అనంతరం ఒకటి రెండు రోజులు ఇదే పరిస్థితి ఉండనుంది. అలాగే శివరాత్రి సందర్భంగా ప్రజలు ఉపవాసం ఉంటారు. మార్కెట్‌లో కందగడ్డ, పండ్లు, పూల అమ్మకాలకు డిమాండ్ పెరిగింది. దీంతో అరటిపండ్లు 80 డజను, కర్బూజా, వాటర్‌మిలన్ ధరలకు రెక్కలొచ్చాయి.

వీటితో పాటు కూరగాయల ధరలు పెరిగాయి. టమాట రూ.10కిలో ఉండగా రూ.20, చిక్కుడు కాయ కిలో రూ.160కి చేరుకుంది. పులగంద రూ.140లకు చేరుకుంది. మిర్చి కిలో రూ.80, బీరకాయ రూ.100, వంకాయలు రూ.80, బెండకాయలు రూ.80, సోరకాయ రూ.40, కాకరకాయ రూ.60, అలిచంత రూ.80, గోరుచిక్కుడు రూ.80, శామగడ్డ రూ.80, క్యాబేజీ రూ.40, మునక్కాయ రూ.120, క్యాలీఫ్లవర్ రూ.40, బెండకాయలు రూ.80, కీర రూ.50, క్యాప్సికమ్ రూ.80, క్యారెట్ రూ.40, బిన్నీస్ రూ.80, పప్పుదోశ రూ.60, ఆరుగడ్డ రూ.30, ఆకు కూర లు కూడా రెట్టింపు చేసి అమ్ముతున్నారు. పాలకూర రూ.60లకు అమ్ముతున్నారు. నిన్నటి వరకు రూ.30 నుంచి రూ.40ఉన్న ధరలను వ్యాపారులు రూ.60 నుంచి రూ.80లకు పెంచి విక్రయిస్తున్నారు. పండుగ సందర్భంగా హోల్ సేల్ వ్యాపారులు రేట్లు పెంచడంతో వినియోగదారుల జేబులు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొన్నది.

మేళాలో ప్రజల సమస్యలు పరిష్కారం

- మున్సిపాలిటీకి రూ.16.27 లక్షల ఆదాయం



మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మేళా

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఎల్ఆర్ఎస్, ట్రేడ్ లైసెన్స్, రెవెన్యూ మేళాలో పలు సమస్యలు పరిష్కారమయ్యాయి. ఈనెల 10 నుంచి మంగళవారం వరకు మున్సిపల్ కార్యాలయంలో మేళాలు నిర్వహించారు. ఇందులో డ్యాక్యూమెంట్లలో వివిధ రకాల తప్పులు, ప్రభుత్వ భూముల సర్వే నంబర్‌లలో ఉన్న ప్రైవేట్ భూములను సర్వే చేయించారు. మ్యూటేషన్, ఆస్తి పన్ను హెచ్చు తగ్గులను సరిదిద్ది పన్ను చెల్లించే ఏర్పాటు చేశారు. కొత్త ఇంటి నంబర్లు జారీ చేయడంతో పాటు గతంలో ఇంటి నంబర్లు లేని వారికి ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. వారసత్వ ఇండ్ల యజమానుల పేర్ల మార్పిడి చేశారు. వారస్తత్వంగా వచ్చిన, పొత్తుల ఆస్తులు విడదీసి వారసుల పేర్లు ఎక్కించారు. ట్రేడ్ లైసెన్స్‌లు లేని వ్యాపారులకు జరిమానాలు లేకుండా లైసెన్స్‌లు ఇవ్వడంతో పాటు పాత ట్రేడ్ లైసెన్సులు రిన్యూవల్ చేశారు.

మేళాకు వచ్చిన దరఖాస్తులు ఇలా...

ఈ మేళాలో పలు సమస్యలపై 330 దరఖాస్తులు వచ్చాయి. ఎల్ఆర్ఎస్‌కు 150 మంది దరఖాస్తు చేసుకోగా 34 పరిష్కరించారు. దీని ద్వారా రూ.12 లక్షల ఆదాయం వచ్చింది. రెవెన్యూ మేళాలో 120 దరఖాస్తులు రాగా వాటి పరిష్కారంతో రూ.4 లక్షల 12 వేల ఆదాయం, ట్రేడ్ లైసెన్స్ మేళాలో 60 దరఖాస్తులను పరిశీలించి నూతన లైసెన్స్‌లు జారీ చేశారు. వీటి ద్వారా రూ.2లక్షల 15 వేల ఆదాయం ఖాజానాకు చేరింది. మొత్తం రూ.16 లక్షల 27వేల ఆదాయం వచ్చింది. మంగళవారంతో ముగిసినప్పటికి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు.

మేళాలు మంచి ఫలితాలిచ్చాయి

కమిషనర్ ఆకుల వెంకటేష్



15 రోజుల పాటు నిర్వహించిన మేళాలు మంచి ఫలితాలనిచ్చాయి. సమస్యలు పరిష్కరించి ఎల్ఆర్ఎస్, ట్రేడ్ లైసెన్స్, రెవెన్యూ మేళాల ఫీజులు వసూల్ చేశాం, వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవడంతో పాటు రెన్యూవల్ చేసుకున్నారు. ఈ ప్రక్రియను యథావిధిగా కొనసాగిస్తాం.

రాజన్నా.. వస్తున్నామయ్యా





చలువ పందిళ్ల కింద సేదతీరుతున్న జాతరకు వచ్చిన భక్తులు



కాంతులీనుతున్న వేములవాడ దేవస్థానం

- శివనామస్మరణతో మార్మోగుతున్న వేములవాడ రాజన్న క్షేత్రం
- మహాశివరాత్రి వేడుకలు ప్రారంభం
- భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం

సిరిసిల్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలు మంగళ వారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. మూడు రోజుల పాటు సాగే రాజన్న జాతరకు తెలంగాణతోపాటు ఆంధ్రా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులను తీర్చుకోనున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున అధికారులు, అర్చకులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మహా శివరాత్రి పర్వదినం బుధవారం వేములవాడ రాజన్న సన్నిధిలో జాగరణ చేయడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. నాలుగు లక్షల మంది భక్తులు తరలివస్తా రనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేశారు.

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో అనుబంధ దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లు వేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను ఉచితంగా దేవాలయాన్ని చేర్చే విధంగా వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి 14 బస్సులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఏర్పాట్లను నిరంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ పర్య వేక్షిస్తున్నారు. పోలీస్ ఔట్‌పోస్టులు, కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. తాత్కాలిక వైద్యశాల ఏర్పాటు చేశారు.



ఆలయ ఆవరణలో పోలీస్ సిబ్బంది

జిల్లాస్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. 1,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఉచిత భోజనం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. వేములవాడకు వచ్చే అన్ని దారుల్లో భారీ స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. దేవాలయం ప్రాంగణంలో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శివార్చన పేరిట సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య చర్యలను చేపట్టారు. ఇందుకోసం జోన్‌లను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు.

ప్రత్యేక పూజలు..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాజరాజేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి 7 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శ్రీస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రాత్రి 7.30 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వారి ద్వారా పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు నిశీ పూజ అనంతరం భక్తులకు స్వామివారి లఘు దర్శనం, కోడె మొక్కులు కొనసాగి స్తారు. బుధవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా లఘు దర్శనాలు, కోడె మొక్కులు నిరంతరాయంగా కొనసాగుతాయి. బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల వరకు స్థానికులకు సర్వదర్శనం, 1.30 నుంచి 2.30 గంటల వరకు దాతలు, స్థానిక అధికారులకు దర్శనం, 3.30 నుంచి 3.40 వరకు ఆలయ శుద్ధి, మంగళ వాయిద్యాలు, 3.40 నుంచి 4.23 వరకు సుప్రభాతం, ఉదయం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు ప్రాతఃకాల పూజ, అర్చకుల దర్శనం, అనంతరం నిరంతరాయంగా దర్శనాల ఉంటాయి. సాయంత్రం 6.08 నుంచి స్వామి వారి కల్యాణ మండపంలో మహా లింగార్చన, రాత్రి 11.30 నిమిషాలకు లింగోద్భవ కాలలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభి షేకం నిర్వహిస్తారు.

రూ.2.03 కోట్లతో ఏర్పాట్లు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజన్న క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రూ.2.03 కోట్లతో ఏర్పాట్లు చేశారు. వాహనాల పార్కింగ్, చలువ పందిళ్ల, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, రాజన్న జల ప్రసాదం, మజ్జిగ ప్యాకెట్లు, శుద్ధ జల క్యాన్లు, వాటర్ ట్యాంకర్‌లు వంటివి ఏర్పాటు చేశారు. హెల్ప్‌సెంటర్లు, ఆరోగ్య శిబిరాలను సిద్ధం చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ధర్మగుండంలో నీటిని నిరంతరం శుభ్రం చేయడంతోపాటు 137 తాత్కాలిక స్నానపు గదులు, 60 చోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు సిద్ధం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేములవాడకు వచ్చే భక్తుల కోసం హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, హన్మకొండ, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, నిజామాబాద్, జగిత్యాల మహబూబ్‌నగర్, నర్సంపేట కోరుట్ల, మెట్‌పల్లి ఆర్మూర్, నిర్మల్, మంచిర్యాల ఆదిలాబాద్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యే కంగా 850 బస్సులను నడుపుతున్నారు. భక్తులకు స్వామివారి ప్రసాదం కోసం ఐదు లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. అభిషేకం లడ్డూ 100, సాధారణ లడ్డూ .20, పులిహోర 15 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. భక్తులు రాజన్న ఆలయంలో కోడె మొక్కులు చెల్లించుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీఐపీ బ్రేక్ దర్శనానికి 300, కోడె మొక్కుకు 200 రూపాయలు వసూలు చేయనున్నారు. భక్తులకు జాగరణ సమయంలో ప్రత్యేకంగా శివార్చన వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



తరలి వస్తున్న భక్తులు

అడుగడుగునా పోలీస్ బందోబస్తు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రికి మంగళవారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. బుధవారం మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి 11 గంటల నుంచి 1.30 గంటల వరకు పురజ నులకు దర్శనం అవకాశం కల్పించారు. 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు దాతలు, అధికారులు, మీడియా ప్రతినిధులకు దర్శనం కల్పించారు. దీంతో భక్తులు పెద్ద సంఖ్యలో రాజన్న దర్శనం కోసం క్యూలైన్ లో బారులు తీరారు.

అడుగడుగునా సోదాలు..

వేములవాడలో నిర్వహించే మహా శివ రాత్రి జాతర సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో 1500మంది పోలీసులు సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. రాజన్న క్షేత్రంలోకి వచ్చే ప్రతి వాహనాన్ని సోదాలు చేస్తూ పట్టణంలోకి అనుమతిస్తున్నారు. 900లకు పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

రాజన్నను దర్శించుకున్న భక్తులు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు ధర్మ గుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్ర దర్శనం, కోడె మొక్కు క్యూలైన్‌లో భక్తులు ఆలయం లోకి చేరుకుని శ్రీపార్వతిపర మేశ్వరులను దర్శించుకుని తరించారు. రాజన్న దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షించారు. రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి క్యూలైన్‌లు త్వరగా కదిలేలా చర్యలు తీసుకున్నారు.





జాతరకు వేములవాడకు వస్తున్న వృద్ధులు



ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

వైభవంగా దుబ్బరాజన్న కల్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన కలెక్టర్



శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సారంగాపూర్, ఫిబ్రవరి, 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం దుబ్బరాజన్న క్షేత్రంలో మంగళవారం వేదపండితులు చంద్రశేఖర్ శర్మ నేతృత్వంలో శివ పార్వతుల కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించారు. కలెక్టర్ సత్యప్రసాద్ స్వామి వార్ల కల్యాణానికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు కలెక్టర్‌కు తీర్థ ప్రసాదాలను అందించి సత్కరించారు. ముందుగా కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల మంత్రోచ్చరణలతో కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకిం చేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అనూష, ఆలయ ఛైర్మన్, పొరండ్ల శంకరయ్య, కొల్ముల రమణ, కోండ్ర రాంచందర్‌రెడ్డి, కోల జమున శ్రీనివాస్, ఆకుల రాజిరెడ్డి, తోడేటి శేఖర్‌గౌడ్, బొడ్డుపెల్లి రాజన్న ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

భక్తుల చేయూతతో శివాలయానికి పునర్ వైభవం

రాయికల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాలయం భక్తుల చేయూతతో పునర్ వైభవం పొంది మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. నాలుగు దశాబ్దాల క్రితం చౌవులమద్ది శివలింగం అనే దళిత వ్యక్తి కృషితో నిర్మితమై ఆయన చేతనే పూజలు అందుకుంది. 2024లో శివలింగం శివైక్యం చెందడంతో నిత్య పూజలు ఆగిపోయి శివాలయం ఆదరణ కోల్పోయింది. దీంతో శివ భక్తులైన యువకులు మన శివాయలం పేరిట గత అక్టోబరు నెలలో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయడంతో పలువురు స్పందించి విరాళాలు అందించారు. వాట్సాప్ గ్రూపులో 689 మంది సభ్యులుగా ఉన్నారు. అందులో ఆలయానికి సంబంధించిన వివరాలు, ఖర్చులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నారు. శివలింగం కుటుంబసభ్యులతో పాటు మన శివాలయం పేరిట అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. వాట్సాప్ గ్రూపులో ఉన్న సభ్యులంతా నెలకు రూ.100 చొప్పున క్యూఆర్ కోడ్‌తో ఉన్న అకౌంట్‌లో వేస్తే ఆలయ అకౌంట్‌లో జమ అవుతున్నాయి. వాటిని ప్రతి నెలా ఆలయ పూజారి వేతనం, నిత్య దీపారాధనకు వెచ్చిస్తున్నారు. దీంతో శివాయంలో మళ్లీ పూజలు ప్రారంభం కావడంతో భక్తుల రాక పెరిగింది.



ఉత్సవాలకు ముస్తాబైన రాయికల్ శివాలయం

కోటి వరాల దేవుడు రాజన్న..

- ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్
- విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రాజన్నకు పట్టువస్త్రాల సమర్పణ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కోడెమొక్కు చెల్లించుకుంటే కోటి వరాలు ఇచ్చే దేవుడిగా వేములవాడ రాజన్న ప్రసిద్ధి కెక్కాడని, దేశంలో ఎక్కడా లేని మొక్కు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఉందని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని మంగళవారం రాత్రి శ్రీరాజరాజేశ్వర స్వామివారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దంపతులతో కలిసి పొన్నం దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన పొన్నంకు ప్రభుత్వ విప్, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. మంగళవాయిద్యాల మధ్య పట్టువస్త్రాలను తీసుకుని ఆలయంలోకి ప్రవేశించారు.

ముందుగా శ్రీలక్ష్మీగణపతి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీరాజరాజేశ్వరస్వామి వారి అభిషేక పూజలో పాల్గొ న్నారు. అనంతరం జగజ్జనని శ్రీపార్వతి దేవి అమ్మ వారిని దర్శించుకుని తరించారు. మహా మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పొన్నం మాట్లాడుతూ రాజన్న సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎనిమిది మంత్రి మంత్రులం ఆలయానికి వచ్చామని, ఆలయాభివృద్ధికి తోటి మంత్రులతో కలిసి కృషి చేస్తున్నామని, రాజన్న ఆలయాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. అధికారులు సమన్వ యంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారని, రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు ఉపవాసంతో ఉంటారని, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరగా దర్శనం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించామ న్నారు. వచ్చే శివరాత్రి వరకు అభివృద్ధి పనులు ముందుకు సాగేలా రాజన్నను వేడుకున్నట్లు తెలిపారు.

లోకకళ్యాణం జరగాలని వేడుకున్నాను.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని, లోకకళ్యాణం జరగాలని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని వేడుకున్నానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. భక్తులకు త్వరగా దర్శనం కలిగేలా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. అంతే కాకుండా రాజన్న ఆలయంలో రూ. 70 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరింత అభివృద్ధి జరిగే లా మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ముందుకు సాగుతామన్నారు. వెంట ఈవో వినోద్‌రెడ్డి కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్, నాగం కుమార్, చిలుక రమేష్ సాగరం వెంకటస్వామి, పొత్తూరి శ్రీనివాస్ ఉన్నారు.

రాజన్నకు టీటీడీ పట్టువస్త్రాలు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారికి తిరుమల, తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఈవో లోకనాథం నుంచి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కాగా ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అలాగే స్వామివారి ఆలయానికి శృంగేరి పీఠం తరఫున వేదపండితులు రాధకృష్ణశర్మ పట్టువస్త్రాలు సమర్పించారు. తిరుమల, తిరుపతి, శృంగేరి సభ్యులను మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లు ఘనంగా సన్మానించారు.







రాజన్నకు పట్టు వస్త్రాలు తీసుకువెళుతున్న మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్ దంపతులు, తిరుమల, తిరుపతి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న డిప్యూటీ ఈవో లోకనాథం, శృంగేరి పీఠం నుంచి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న రాధకృష్ణశర్మ

కన్నుల పండువగా మల్లికార్జునుడి శోభాయాత్ర

ఓదెల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సోమవారం భ్రమరాంభ మల్లికార్జునస్వామి శోభాయాత్రను కన్నులపండువగా నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల గుండా ఊరేగించి మేళతాళాలతో ఒగ్గుడోలు కళాకారులు, పోతరాజుల నృత్యాలతో స్వామివారిని ఊరేగించారు. మహిళలంతా మంగళహారతులతో ఉత్సవ మూర్తులను దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈవో సదయ్య, అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.



సూక్ష్మ కళాకారుడి ప్రతిభ

గుండు పిన్నుపై శివయ్య, నందీశ్వరుడు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని తులసీ నగర్‌కు చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ గుండు పిన్నుపై శివయ్య, నందీశ్వరుడిని తయారు చేశాడు. ఇంతకు ముందు గుండు పిన్నుపై వివిధ కళాఖండాలను రూపొందించిన దయాకర్‌ను పలువురు ప్రశంసించారు.





గుండు పిన్నుపై తయారు చేసిన శివయ్య, నందీశ్వరుడు, కళాకారుడు దయాకర్

చాక్ పీస్‌లతో శివలింగం

ఓదెల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని మడకకు చెందిన సూక్ష్మ కళాకారుడు ఆడేపు రజనీకాంత్ చాక్‌పీస్ లతో 109 శివలింగాలను రూపొందించారు. సుమారు పది గంటల పాటు శ్రమించి సూక్ష్మ కళా నైపుణ్యంతో తీర్చిదిద్దారు. సెంటిమీటర్ ఎత్తు, వెడల్పు, చాక్ పీసులపై స్కాల్పరింగ్ ఆర్ట్ ద్వారా గుండు పిన్నులతో శివలింగాలను రూపొందించినట్లు తెలిపాడు. గతంలో పెన్సిల్ గ్రాఫైట్‌పై శివలింగం, క్యారెట్, బంగాళదుంపలతో కార్వింగ్ కళా నైపుణ్యంతో శివలింగాలను తయారు చేసినట్లు రజనీకాంత్ తెలిపారు. గతంలో కూడా ఇలాంటి ఆకృతులను రూపొందించి, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్, ఆర్‌హెచ్‌ఆర్ ప్రపంచ రికార్డులు, ఉత్తమ కళాకారుడిగా అవార్డు అందుకున్నారు.





చాక్‌పీస్‌లతో రూపొందించిన శివలింగం, కళాకారుడు రజనీకాంత్



జ్యోతిప్రజ్వలన చేసి శివార్చన వేదికను ప్రారంభిస్తున్న పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్

శివార్చన వేదికను ప్రారంభించిన మంత్రి, విప్

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయ గుడి చెరువులో ఏర్పాటు చేసిన శివార్చన వేదికను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డితో కలిసి బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. కళాకారులు ప్రదర్శించిన ఒగ్గు కళాకారుల నృత్యాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈవో వినోద్‌రెడ్డి, మామిడి హరికృష్ణ, నాగం కుమార్, కనికరపు రాకేష్, సాగరం వెంకటస్వామి, సంద్రగిరి శ్రీనివాస్, తూం మధు, ఇప్పపూల అజయ్, అన్నారం శ్రీనివాస్, పొత్తూరి శ్రీనివాస్ ఉన్నారు.



కళాకారులతో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం మంగలవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతా ళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహర నాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి.

పట్టభద్రులు.. మీ ఓటు పదిలంగా వేయండి



చొప్పదండి. ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సమయం దగ్గర పడుతుంది. ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లకు భిన్నంగా జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ బ్యాలెట్ పద్ధతిలో జరుగుతుంది. అనేక మంది కొత్తగా ఓటర్‌గా నమోదు కాగా ఓటు వేయడానికి పలు జాగ్రత్తలు పాటించాలి. ఓటు వినియోగంపై పట్టభద్రుల అవగాహన కోసం..

ముఖ్యాంశం..

ఓటు ఇలా వేయాలి...

- పోలింగ్ బూత్ బయట మీ ఓటర్ క్రమసంఖ్యను చూసుకోండి.
- బూత్ లోపలికి వెళ్లే ముందు మీ పేరు చూసుకొని సంతకం చేయాలి.
- ఓటు వేయడానికి వెళ్లే సమయంలో ఎన్నికల కమిషన్ సూచించిన ఏదైనా ఐడీ కార్డును వెంట తీసుకుపోవాలి.
- పోలింగ్ కేంద్రాలలో ఇచ్చే పెన్‌ను మాత్రమే వాడాలి.
- పోలింగ్ బూత్‌లో మీకు ఇచ్చిన బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థి పేరు, ఫొటో ఉంటుంది.
- మీరు మొదటి ప్రాధాన్యత ఇచ్చే అభ్యర్థికి ఎదురుగా ఉన్న బాక్స్‌లో ఒకటి అని రాయాలి.
- ఇతర అభ్యర్థులకు కూడా మీరు నచ్చిన ప్రాధాన్యత ఓటు వేసుకోవచ్చు. 1,2,3 ఇలా నంబర్ వేసి ఓటు వేసుకోవచ్చు.

ఓటర్లు చేయకూడని పనులు

- పోలింగ్ బూత్‌లో మీ స్వంత పెన్‌ను వాడవద్దు.
- అభ్యర్థులు అందరికీ ఒకే నంబర్ ఇవ్వవద్దు.
- బ్యాలెట్ పేపర్‌లోని బాక్స్‌లో ఒకటి అని రాయవద్దు. ఇంగ్లీష్‌లో కూడా రాయవద్దు. కేవలం అంకెలు (1,2,3) అని మాత్రమే వేయాలి.
- బ్యాలెట్ పేపర్‌లో ఎక్కువ పేర్లు ఉంటాయి. మీకు నచ్చిన వారికి 1 నంబర్ వేయాలి.
- ఎన్నికల సిబ్బంది చెప్పినట్లుగానే బ్యాలెట్ పేపర్‌ను ఫోల్డ్ చేయాలి. లేని పక్షంలో ఓటు చెల్లదు.
- బ్యాలెట్‌ను ఖాళీగా వేయరాదు. ఇంక్ పెన్నుతో ప్రాధాన్యత నంబర్‌ను రుద్దవద్దు.
- అభ్యర్థి పక్కన సూచించిన బాక్స్ వద్ద కాకుండా ఇతర చోట్ల అంకెలు వేస్తే ఓటు చెల్లదు.
- బ్యాలెట్ పేపర్‌లో (1,2,3) అంకెల ప్రాధాన్యత కాకుండా ఇతర నెంబర్లు వేస్తే ఓటు చెల్లదు.

ఎమ్మెల్సీ ఫలితాలను రెఫరెండంగా భావిస్తారా..

- ఎన్నికల్లో గెలిచేది బీజేపీ అభ్యర్థులే.. ● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ 14 నెలల పాలన బాగుందని అంటున్న సీఎం ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను రెఫరెండంగా తీసుకునేందుకు సిద్ధమా అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. కులగణనకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదిక ఇచ్చి మూడు నెల లైనా ఎందుకు బయటపెట్టలేదన్నారు.

ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ వల్లే ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైందని సీఎం హోదాలో రేవంత్‌రెడ్డే చెప్పారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ గడువును పొడగిస్తున్నారే తప్ప కేసీఆర్‌ను ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. దమ్ముంటే సీబీఐ విచారణ కోరాలని, దోషులందరినీ అరెస్టు చేసి బొక్కలో వేస్తామన్నారు. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అంటే రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి కూడా వరి వేయొద్దు వేస్తే నష్ట పోతారని రైతులను హెచ్చరిస్తున్నారన్నారు. పొరుగు రాష్ట్రానికి నీటిని దోచి పెట్టడం వల్లే ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడ్డా నీటి కటకట ఎందుకు వచ్చిందన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయుల పక్షాన పోరాటం చేసేది బీజేపీ పార్టీ మాత్రమే అన్నారు. బీజేపీని ఆదరించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటేపల్లి వెంకట రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలరాం చంద్రారెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె సంగప్ప పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, పక్కన ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటేపల్లి వెంకటరమణారెడ్డి, నాయకులు

కేంద్ర మంత్రి బండి సంజయ్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి..



మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్, పక్కన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

- అడుగడుగునా బీసీలను అణచివేస్తున్న బీజేపీ
- పట్టభద్రుల ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటేయాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

కరీంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రమంత్రి స్థాయిలో వ్యవహరించకుండా బండి సంజయ్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బండి సంజయ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ఫార్ములా ఈ రేసు అవినీతిపై కేటీఆర్‌పై కేసు నమోదై, విచారణ జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు కూడా ఇవ్వలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విదేశాల నుంచి నిందితులను తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న పరిమితి ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేస్తున్న అభివృద్ధి పై చర్చకు సిద్ధమన్నారు.

ఏడాది కాలంలో 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, బీఆర్ఎస్ ప్రభుత్వాలు 10 ఏళ్లలో 50 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలన్నారు. సోషల్ మీడియాను అనైతికంగా అబద్ధపు ప్రచారానికి, వీడియోలను మార్ఫింగ్ చేయడానికి బీజేపీ విచ్చలవిడిగ వాడుతోందని విమర్శించారు. దీనిని ప్రజలు గమనించి అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టభద్రుల సమస్యలు పరిష్కారించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిల పాత్ర ఏంటి? అనేది ఒక సారి ఆలోచన చేసుకోవాలన్నారు. సమగ్ర కుల గణనపై సర్వేపై బీజేపీ తన అభిప్రాయం ఏంటో చెప్పాలన్నారు. ధైర్యం ఉంటే బీసీ రిజర్వేషన్ల బిల్లును తొమ్మిదదో షెడ్యూల్‌లో చేరుస్తామని, ప్రధానిని ఒప్పించి 42 శాతం రిజర్వేషన్లకు తెస్తామని బీజేపీ నేతలు చెప్పా లన్నారు. పట్టభద్రుల ఎన్నికలు రాష్ట్ర స్థితిగతులు రాష్ట్ర అంశాలను అవగాహనతో ఓటు వేసే అంశమని, బీసీలను అణగదొక్కుతున్న బీజేపీకి ఓటేస్తారా...? బీసీలకు సర్వం చేస్తున్న కాంగ్రెస్‌కు ఓటేస్తారా పట్టభద్రులు ఆలోచించాలన్నారు. నిన్న ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో జరిగిన సమావేశాలు విజయవంతం కావడంతో దిమ్మతిరిగి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరన్నారు.

సమావేశంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగ రాఘవరెడ్డి, నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, ఎర్ర శ్రీనివాస్, వైద్యుల అంజన్ కుమార్, ఎండీ తాజొద్దీన్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, మాజీ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, ఆకుల ప్రకాశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఏమి చేయగలడో చేసి చూపిస్తా

రాజకీయాలను కలుషితం చేస్తున్న రెండు పార్టీల అభ్యర్థులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఎమ్మెల్సీలుగా గెలిచిన వారెవ్వరూ పట్టభద్రులు, ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోలేదు.. నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఏమి చేయగలడో చేసి చూపిస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సర కాలంగా 42 నియోజక వర్గాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నానని తెలిపారు. డబ్బులు ఉంటేనే రాజకీయం చేయవచ్చు భావన అనే పోవాలని, బలహీన వర్గాల బిడ్డ ఎందుకు రాజకీయం చేయవద్దు అనే అంశంతో తాను ముందుకు వచ్చానన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల్లో ఒకరు పారిశ్రామిక వేత్త, ఇంకొకరు కార్పొరేట్ విద్యావేత్త అని, వీళ్లు ఎందుకు రాజకీయాలను కలుషితం చేస్తున్నారని ప్రశ్నించారు. వారు ఈ రోజు డబ్బులు పంపిణీ చేస్తున్నారని విమర్శించారు. తాను అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజల ముందుకు వచ్చానన్నారు. తాను గెలవక పోతే డబ్బులు రాజకీయాలను ప్రభావితం చేసినట్లేనని, రాజకీయాల్లో డబ్బు ప్రామాణికం కాదన్నారు. తెలంగాణ రూపురేఖలు మారాలి అంటే తన లాంటి వాళ్ళు గెలవాలన్నారు. ఈ గుండె ఏడు నెలలుగా తిరిగి అలిసి పోయిందని, భవిష్యత్ రాజకీయాల్లో ఈ గుండెను మీరే ముందుకు తీసుకుపోవాలన్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా ఇన్ని రోజులు ప్రచారం చేసానని, రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బులు లేకుండా విద్యావంతులు సర్పంచ్‌లు కావాలి అంటే తన గెలుపు నుంచి మొదలవ్వాలన్నారు. మహిళా సాధికారత గురించి ఏ పార్టీ చర్చించలేదని, తన పేరులో సగం తన భార్యపేరు ఉందని, తనకు మహిళలంటే గౌరవం ఉందన్నారు.

'జూకంటి'కి కొలకలూరి కవితా పురస్కారం

నేడు హైదరాబాద్‌లో ప్రదానం



సిరిసిల్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కవి జూకంటి జగన్నాథం రచించిన 'ఒక కప్పు ఛాయ్- నాలుగు మేసేజ్‌లు' కవితా సంపుటి కొలకలూరి భగీరథ కవితా పురస్కారానికి ఎంపికయ్యింది. బుధ వారం సాయంత్రం హైదరాబాద్‌లో తెలుగు యూనివర్సిటీలో ఎన్‌టీఆర్ కళాప్రాంగణంలో నిర్వహించ నున్న కార్యక్రమంలో జూకంటి జగన్నాథంకు నిర్వాహకులు పురస్కారం అందించనున్నారు.

తండ్రి హత్య కేసులో కుమారుడికి జీవిత ఖైదు

సుల్తానాబాద్ ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):తండ్రిని హత్య చేసిన కేసులో కుమారుడికి జీవిత ఖైదుతోపాటు ఐదు వేల రూపాయలు జరిమానా విధిస్తూ పెద్దపల్లి మున్సిఫ్ జడ్జ్ సెషన్ కోర్టులో మంగళవారం తీర్పు ఇచ్చారు. పూసాల గ్రామానికి చెందిన తీగల నర్సయ్య వ్యవసా యం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి భార్య భూదేవి, కొడుకు రాజేషంతో పాటు మరో కుమారుడు ఉన్నారు. జులాయిగా తిరుగుతూ ఇంటి వద్ద ఉంటున్న కొడుకు రాజేశంను ఐకేపీలో ఆరబోసిన ధాన్యం పనుల్లో సహాయం కోసం రమ్మన్నాడు. ఐకేపీ సెంటర్ వద్ద తండ్రి కొడుకుల మధ్య ఘర్షణ జరగగా ఆవేశంలో కొడుకు రాజేశం తండ్రి నర్సయ్యను నెట్టి వేయగా కింద పడిన తండ్రి తలపై రాయి వేయగా నర్సయ్య అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటనపై తీగల భూదేవి ఫిర్యాదు మేరకు 8 డిసెంబర్ 2023లో కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేయగా మంగళ వారం పెద్దపల్లి జిల్లా కోర్టులో రాజేశంకు జీవిత కాలం కఠిన కారాగార శిక్ష, ఐదు వేల రూపాయలు జరిమానా విధించారు.

విద్యార్థిని వేధించిన వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష

సుల్తానాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పూసాల గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని వేధింపులకు గురి చేసిన మియాపూర్ గ్రామానికి చెందిన గోషిక కుమార్‌కు నెల రోజుల జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా, సెషన్స్ జడ్జి శ్రీనివాస రావు మంగళవారం తీర్పు ఇచ్చారు. వేధింపుల సంఘటనపై 20 నవంబరు 2019న బాధితురాలి తండ్రి సుల్తానాబాద్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్దపల్లి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులో కేసు విచారణ జరిగింది. నేరం ఋజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మృతి



చంద్రయ్య (ఫైల్)

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన మెకిరాల చంద్రయ్య (71) అనే వ్యవసాయ కూలీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం చంద్రయ్య గ్రామ శివారులోని మామిడితోటలో కూలీగా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం సైకిల్‌పై ఇంటికి భోజనానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో చంద్రయ్య అక్కడి కక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చంద్రయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మృతదేహంతో ఆందోళన

మాదాపూర్ గ్రామంలో ట్రాక్టర్ యజమాని ఇంటి ఎదుట చంద్రయ్య మృతదేహంతో బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చంద్రయ్య బంధువులను సముదాయించి అక్కడి నుంచి పంపించి వేశారు. చంద్రయ్య అంత్యక్రియలను నిర్వహించే వరకు పోలీసులు గ్రామంలో పికెటింగ్ నిర్వహించారు.

తండ్రి ఆస్తి కోసం కొడుకు పథకం



హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

- హుజూరాబాద్ చోరీని 24 గంటల్లో ఛేదించిన పోలీసులు
- కొడుకు, కోడలుతో పాటు మరో ముగ్గురు అరెస్టు, పరారీలో ఒకరు
- 70 తులాల బంగారం, రూ.1.50లక్షలు స్వాధీనం

హుజూరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తండ్రి ఆస్తిని కాజేయాలని కొడుకు, కోడలు పథకం వేశారు. హుజూరాబాద్‌లో సంచలనం సృష్టించిన భారీ దొంగతనం కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. అప్పుల పాలై తండ్రిని డబ్బులు అడిగితే ఇవ్వకపోవడంతో కొడుకు, కోడలు ఆస్తి కోసమే పథకం ప్రకారం దొంగతనం చేసి దొరికిపోయారు. వీరికి సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఒకరు పరారీలో ఉన్నారు. హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ మంగళవారం చోరీ వివరాలు తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని ప్రతాపవాడకు చెందిన ప్రతాప రాఘవరెడ్డి-వినోదలకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కొడుకు ప్రతాప నాగరాజు-శాలినిలు వ్యాపారం చేసి రూ. కోటి వరకు అప్పుల పాలయ్యారు. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి ఎక్కువ కావడంతో తండ్రి వద్ద ఉన్న డబ్బులు, బంగారం దోచుకోవాలని నెల రోజుల క్రితం ప్లాన్ వేసుకున్నాడు. ఇందుకు అతని హోటల్‌లో పనిచేసే అమీర్‌ను సాయం కోరగా, అతని బంధువైన హనుమకొండ జిల్లా, స్టేషన్‌ఘణపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన పాత నేరస్తుడు సమీర్, కరీంనగర్‌కు చెందిన మున్నా, హుస్నాబాద్ మండలం కుందువనిపల్లెకు చెందిన కృష్ణలతో సుపారీ మాట్లాడుకున్నారు. పథకం ప్రకారం హోటల్‌లో దొంగతనం గురించి చర్చించుకొని ఆదివారం రాత్రి నాగరాజు, శాలిని, అమీర్‌లు పక్కనే ఉన్న వారి ఇంటిలో ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉన్నారు. అర్ధరాత్రి తర్వాత మరో ముగ్గురు కరెంట్ మోటార్ ఆన్ చేయగా నీళ్ల శబ్దం విన్న రాఘవరెడ్డి భార్య వినోద బయటకు వచ్చింది. సమీర్, మున్నా, కృష్ణలు ఇంట్లోకి చొరబడి, ఆమెను కత్తులతో గాయపరిచి కట్టేశారు. ఈ క్రమంలో రాఘవరెడ్డి, ఆయన కూతురు మానస రూమ్‌లో నుంచి బయటకు రాగానే వారిపై దాడి చేశారు. కత్తులతో బెదిరించి 70తులాల బంగారం, రూ. 5లక్షల నగదును దోచుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌ను పిలిపించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం కుటుంబ సభ్యులను పలు కోణాల్లో విచారించారు. కొడుకు నాగరాజుపై అనుమానం రావడంతో పోలీసులు తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. దీంతో నిందితులను పోలీసు లు అదుపులోకి తీసుకుని 70తులాల బంగారం, రూ. 1.50లక్షల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

24గంటల్లో ఛేదించిన పోలీసులు

హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో 24గంటల్లోనే దొంగతనం కేసును సీఐ తిరుమల్‌గౌడ్, ఎస్సై యూనస్, సీసీఎస్ టీమ్ సురేందర్‌పాల్, సాయి, అవినాష్, టెక్‌టీమ్ సిబ్బంది ప్రదీప్, సంతోష్ పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పథకం ప్రకారం నాగరాజు హోటల్‌లో పనిచేసే అమీర్ వేలిముద్రలు దొరకవద్దనే ఉద్దేశ్యంతో ముందస్తుగా హుజూరాబాద్ పట్టణంలోని ఓ మెడికల్ షాపులో వారం రోజుల క్రితం గ్లౌజులు కొనుగోలు చేశాడు. అంతేకాకుండా దొంగతనంలో జరిగిన పెనుగులాటలో ఓ వ్యక్తి బ్రాస్‌లెట్ పడిపోయింది. వాటిని ఆధారంగా తీసుకున్న పోలీసులు మెడికల్ షాపునకు వెళ్లి సీసీ ఫుటేజీలను తీసుకొని విచారించగా నాగరాజు కొనుగోలు చేయమంటే గ్లౌజులు కొనుగోలు చేశానని అమీర్ చెప్పాడు. అలాగే నాగరాజు సెల్‌ఫోన్ డాటా ఆధారంగా కూపీ లాగడంతో దొంగతనం కేసు బయటపడింది. చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులను ఏసీపీ శ్రీనివాస్‌జీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం

టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడానని, తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే శాసన మండలిలో ఉపాధ్యాయుల గొంతుకనై ప్రశ్నిస్తానని కరీంనగర్, నిజామా బాద్, మెదక్, ఆదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీతో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీగా గెలిపిస్తే సీపీఎస్ రద్దుకు కృషి చేస్తానని, కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేసేలా ప్రభుత్వంతో పోరాడుతానని హామీ ఇచ్చారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాల చెల్లింపు, హెల్త్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ వసతి గృహ భవనాల నిర్మాణాలు, తదితర సమస్యల పరిష్కారంలో ముందుంటానని హామీ ఇచ్చారు. టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నబోయిన తిరుపతి, బిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము రమేష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కాంపెల్లి లక్ష్మన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల కోసం నిరంతరం పోరాడే వ్యక్తి అశోక్‌కుమార్ గెలుపునకు సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులు ఓటేయాలని కోరారు. సమావేశంలో పోచయ్య, పర్శరాములు గౌడ్, జీవన్ రాజు, కోల రాజమల్లు, డానియల్, దేవదానం, హెచ్‌ఎం నేదునూరి కనకయ్య పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీగా అశోక్‌కుమార్‌ను గెలిపించండి

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

కరీంనగర్ టౌన్: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ టీచర్ ఎమ్మెల్సీగా ఉద్యమ నేత అయిన వై.అశోక్‌కుమార్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలతో ఆయన సమావేశయ్యారు. 36 ఏళ్లకుపైగా ఉపాధ్యాయ ఉద్యమ అనుభవం కలిగిన తెలంగాణ ఉపాధ్యాయ ఉద్యోగుల జేఏసీ నాయకుడిగా అశోక్ కుమార్ పనిచేశారని, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేశారని అన్నారు. ఆయనను టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. సమావేశంలో టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై అశోక్‌కుమార్, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తిరుపతి, కె రమేష్, అశోక్‌కుమార్‌పాల్గొన్నారు.

శంభో శంకరా...

మంథని/కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని శైవక్షేత్రాలు శివరాత్రి పండుగకు ముస్తాబయ్యాయి. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా వారం రోజుల ముందు నుంచే ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. స్థానిక కోదండ రామాలయ శివాలయంలో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. భక్తుల దర్శనానికి బారికేట్లు ఏర్పాటు చేయడంతో పాటు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈసారి శివపార్వతుల కల్యాణోత్సవానికి ఇబ్బంది కలగకుండా ఆలయం ఎదుట కల్యాణాన్ని వీక్షించే విధంగా వేదికను సిద్ధం చేశారు. జనగామలోని చారిత్రాత్మక పుణ్యక్షేత్రం త్రిలింగ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. మార్కండేయకాలనీలోని మార్కండేయ ఆలయం, పవర్‌హౌస్‌కాలనీలోని కాశీ విశ్వేశ్వారాలయం, భరద్వాజనగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో రామేశ్వరస్వామికి శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెల్లవారుజాము నుంచే పూజలు

మహా శివరాత్రి ఉత్సవాలు బుధవారం తెల్లవారుజాము 4గంటల నుంచే ప్రారంభమవుతాయి. మేలుకొలుపు, గణపతిపూజ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 7.15గంటలకు శివపార్వతుల కల్యాణం, అర్ధరాత్రి 12.05గంటలకు లింగోద్భవ కార్యక్రమం తదితర పూజలు జరుగుతాయి.

పూజా సామగ్రి విక్రయం

మహాశివరాత్రికి ప్రత్యేక పూజలు, జాగరణ చేసేందుకు కావాల్సిన పూజా సామగ్రి ప్రధాన చౌరస్తా-శివాజీనగర్ కూడలిలో రెండు రోజుల ముందు నుంచే అమ్మకాలు జరుగుతున్నాయి. జాగరణకు కావాల్సిన మట్టి ప్రమిదలు, మోదుగ పూలు, పండ్లు, కుంకుమ, జొన్నకంకులు వంటివి శివునికి అత్యంత ప్రీతికరమైన పూజా వస్తువులు అమ్ముతున్నారు.


జూలపల్లి రాజరాజేశ్వరస్వామి ఆలయానికి వేస్తున్న రంగులు

మంథని: మంథనిలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం శివ పార్వతుల కల్యాణంతో పాటు ప్రత్యేక పూజలు, ఉత్సవాల కోసం ఆలయాలను ముస్తాబు చేశారు. గోదావరి నది తీరంలోని గౌతమేశ్వర స్వామి ఆలయంతో పాటు సురాభండేశ్వర, భిక్షేశ్వర, ఓంకారేశ్వర, శీలేశ్వర-సిద్ధేశ్వర ఆలయాలను రంగులు వేసి ముస్తాబు చేశారు. స్థానిక శ్రీలేశ్వర-సిద్ధేశ్వర, ఓంకారేశ్వర ఆలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. వేలాది మంది భక్తులు హాజరై వీక్షిస్తారు. రాత్రి 12 గంటలకు జరిగే లింగోద్భవ పూజ ప్రత్యేకంగా కొనసాగనుంది. మహా శివరాత్రి రోజు జరిగే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజన ఏర్పాట్లు చేస్తున్నారు.

ముందస్తు పుణ్య స్నానాలు...

మహాశివరాత్రి సందర్భంగా మంథని చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు గోదావరినది తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. దూర ప్రాంతాలకు చెందిన భక్తులు వివిధ వాహనాల్లో గోదావరినదికి వెళ్లి తీరంలో ఏర్పాటు చేసిన షవర్ల కింద పుణ్యస్నానాలు ఆచరించి శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. మార్కెట్‌లో బుధవారం జరిగే మహాశివరాత్రి పూజ, జాగారానికి అవసరం ఉన్న పూజా సామాగ్రి, పండ్లు, పూజలు, కూరగాయలు, ఇతర వస్తువులను మార్కెట్‌లో కొనుగోలు చేశారు. దీంతో మార్కెట్ ఏరియా అంతా రద్దీగా మారింది.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు వడుకాపూర్, పెద్దాపూర్, తెలుకుంట, కుమ్మరికుంట, వెంకట్రావుపల్లి పలు గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వస్వామి ఆలయంలో దాతల సహకారంతో అభివృద్ధి పనులను చేస్తున్నారు. చలువపందిల్లు, తాగునీరు, ప్రసాదం సౌకర్యాలను నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. వడుకాపూర్ శివాలయంలో దాత విరాళంతో ఆలయ ప్రాంగణంలో భవనం నిర్మించారు. మహాదేవుని కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): కల్వచర్ల ప్రాచీన శివాలయంలో మహాశివరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. బుధవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం శివపార్వతి ఉత్సవ మూర్తులతో గ్రామంలో భజన మండలి ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని చేపట్టారు. సీఐ రాజు, ఎస్ఐ దివ్యలు పర్యవేక్షించారు.ప్రత్యేక పోలీస్ బందోబస్తు చేపడతామని సీఐ తెలిపారు. ఆలయకమిటీ సభ్యుడు బూస కనకయ్య తదితరులు పాల్గొన్నారు.


పెగడపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): రాగినేడులోని స్వయంభూ నాగలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయంలో ఆఖండ దీపారాధన, సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనము ఆలయ ప్రధాన అర్చకులు రాజేశ్వరశర్మ నిర్వహించారు. సాయంకాలం అగ్ని ప్రతిష్ఠాపన, గణపతి, శ్రీచండి, రుద్రస్వాహాకార హవనము, రాత్రి నైవేద్యం, హారతి, తీర్థప్రసాదములు నిర్వహించారు. కోలేటి శ్రీనివాస్, ఆలయ చైర్మన్ భూమయ్య, పాల్గొన్నారు.

బుధవారం పార్వతి పరమేశ్వర కల్యాణం నిర్వహించనున్నారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ పట్టు వస్త్రాలు అందించనున్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి గ్రామంలోని విశ్వేశరాలయంలో మహాశివరాత్రి పురస్కరించుకొని మంగళ వారం శివకల్యాణం నిర్వహించారు. ఉదయంనుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఆరెల్లి సుజాతరమేష్, రాపాక కిరణ్‌నీరజ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రాజకొమురయ్యతోపాటు పలువురు దర్శించుకొని పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేదపండితులు భద్రయ్య, భవాని, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


రాగినేడు శివాలయంలో ఉత్సవాలను ప్రారంభిస్తున్న పూజారులు

ప్రచారానికి తెర ప్రలోభాలతో ఎర...

(3వ పేజీ తరువాయి)

మంది ఉన్నారు. వీరి కోసం 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పెద్దపల్లి జూనియర్ కళాశాల కేంద్రంలో ఏర్పాటు చేశారు. అక్కడి నుంచే పోలింగ్ సిబ్బంది సామగ్రిని తీసుకవెళ్లి, తిరిగి అక్కడికే తీసుకరానున్నారు. అక్కడి నుంచి బ్యాలెట్ బాక్సులను కరీంనగర్ కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపర్చనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. ఓటర్లు స్వేచ్ఛగా వెళ్లి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ ఏర్పాట్లను కలెక్టర్ కోయ శ్రీహర్ష పర్యవేక్షిస్తున్నారు. ఓటు వేసేందుకు వెళ్లే ఓటర్లు ఏదేని గుర్తింపు కార్డును వెంట తీసుకుని రావాలని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

అలరించిన విద్యార్థినుల నృత్యాలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో శ్రీవాణి విద్యా సంస్థలు ముందుంటాయని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రేకులపల్లి విజయ అన్నారు. మంగళవారం జూనియర్ కళాశాల విద్యార్థుల వార్షికోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ శశాంక, పురెల్ల సదానందం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలు, అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

విశ్వభారతి పాఠశాలలో..

జ్యోతినగర్ (ఆంధ్రజ్యోతి): విశ్వభారతి పాఠశాలలో ఫేర్‌వెల్ డే నిర్వహించారు. విశ్వభారతి విద్యా సంస్థలకు చెందిన నవోదయ, సెయింట్ జోసెఫ్, విశ్వభారతి పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యా సంస్థల చైర్మన్ యాదగిరిగౌడ్, హెచ్‌ఎంలు తిరుపతిగౌడ్, నోయల్ జోసెఫ్, ప్రవీణ్, జగన్, మధుకర్, ఆశాలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూలపల్లిలో...

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): పెద్దాపూర్‌లో గల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ ఎండి షాదుల్ , అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణవేణిలో అలరించిన ఫుడ్ ఫెస్టివెల్

మంథనిరూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణవేణి హైస్కూల్‌లో ఫుడ్ ఫెస్టివెల్‌ను మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు ఇంట్లో తయారు చేసిన వివిధ రకాల స్వీట్లు, తినుబండరాలను అమ్మకాలు కొనసాగించగా విద్యార్థులు కొనుగోలు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ జాఫర్, డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవతార్ మెహర్‌బాబా జయంతి

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అడ్డగుంటపల్లిలో మంగళవారం అవతార్ మెహర్‌బాబా జయంతి వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి హాజరై మెహర్‌బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్‌కట్ చేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ముత్తారం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అడవిశ్రీరాంపూర్, ముత్తారం, మచ్చుపెట్ గ్రామాల్లో ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి అనూష మంగళవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్‌లను పరిశీలించారు. రైతులకు తప్పని సరిగా రశీదు ఇవ్వాలన్నారు.

నిరుద్యోగులకు అన్యాయం చేసిన బీజేపీ, బీఆర్‌ఎస్

ధర్మారం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు నిరుద్యోగులను నిండా ముంచాయని ప్రభుత్వ విప్, ధర్మపురి శాసన సభ్యులు అడ్లూరి లక్ష్మన్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోటి ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ, నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 14 నెలల కాలంలోనే 56 వేల ఉద్యోగాలు కల్పించిందన్నారు. బీజేపీది స్వదేశీ నినాదం విదేశీ వ్యాపారం అని ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ అన్నారు. ఏఎంసీ చైర్మెన్ రూప్లానాయక్, వైస్ చైర్మెన్ అరిగె లింగయ్య, నాయకులు తిరుపతి రెడ్డి, స్వామి, రవీందర్‌రెడ్డి, తిరుపతి, అజయ్‌పాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): కుందనపల్లి అక్బర్‌నగర్‌లోని లిటిల్ సిటిజెన్ హైస్కూల్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రభుత్వ సలహాదారు హర్కాల వేణుగోపాల్‌రావు ప్రచారం నిర్వహించారు. సిటిజన్స్ స్కూల్ ఉపాధ్యాయులతో సమావేశమై ఈ 27న జరుగనున్న శాసన మండలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఓట్లు వేయాలని కోరారు. కరస్పాండెంట్ నాగరాజు, సమ్మిరెడ్డి, వాజీద్ ఖాన్, రాజమల్లు యాదవ్, శ్యామ్, పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కమాన్‌పూర్,(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని మండల కేంద్రంలో మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు పట్టభద్రుల ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సయ్యద్ అన్వర్, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, సింగిల్ విండో చైర్మన్ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్‌జీ కోరారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. మంథని సురేష్, రవితేజ, మోహన్, బండారి ప్రసాద్, ఐలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి) పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నరేందర్ రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే విజయరమణారావు సూచించారు. క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలు కాంగ్రెస్ జెండా ఎగరవేసే విధంగా పనిచేయాలని సూచించారు. మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్, న్యాయవాదులతో, ప్రైవేట్ టీచర్లతో సమావేశం నిర్వహించారు. గోపగాని సారయ్య గౌడ్, ఎండీ మస్రత్, ఉపు రాజు, బొడ్డుపల్లి శ్రీనివాస్, నూగిళ్ల మల్లయ్య పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు అన్నారు. మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. విజయభాస్కర్‌రెడ్డి, రమేష్‌బాబు, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యం

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహిళాసాధికారత ఎంతో అవసరమని, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహిళా సాధికారత పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఈనెల 28వ తేదీ వరకు మహిళలకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

వైద్య విద్యకు సాయం చేయాలి

మంథని, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మెడికల్ సీటు వచ్చినా ఫీజు కట్టలేని స్థితిలో ఉన్న కాటారానికి చెందిన జ్యోత్స్నకు సహాయం చేయాలనే ఆలోచన కాంగ్రెస్ పార్టీ నేతలకు రావడం లేదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ప్రశ్నించారు. మంగళవారం మాట్లాడుతూ జ్యోత్స్న పరిస్థితిపై కథనాలు వచ్చినా కాంగ్రెస్ నేతల్లో స్పందన రాకపోవడం విచారకరమన్నారు. శంకర్‌గౌడ్, జక్కు రాకేష్, సమ్మయ్య, తిరుపతి పాల్గొన్నారు.

పార్టీ పటిష్టానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కలిసికట్టుగా ముందుకు సాగి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. మంగళవారం మార్కండేయకాలనీలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. చందర్ మాట్లాడుతూ అబద్దాల హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. రాబోయే రోజులు మనవేనని, గులాబీ శ్రేణులు వ్యూహాత్మకంగా ముందుకు సాగాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నాయకులు మూల విజయరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, మాజీ జెడ్‌పీటీసీ అముల నారాయణ, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

బీఎస్పీ అభ్యర్థులను గెలిపించాలి

ఎలిగేడు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్నహరికృష్ణగౌడ్, టీచర్స్ అభ్యర్థి సాయన్న ముదిరాజ్‌లను గెలిపించాలని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబు కోరారు. మంగళవారం శివపల్లి, నర్సాపూర్, లాలపల్లి, సుల్తాన్‌పూర్, ఎలిగేడు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు.

సమస్యలపై పోరాడే పార్టీ బీజేపీనే

జ్యోతినగర్, ఫిబ్రవరి 25: ప్రజా సమస్యలపై పోరాడే, ప్రభుత్వాలను ప్రశ్నించే పార్టీ బీజేపీనేనని ఆ పార్టీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగిన సభలో ఈటెల ప్రసంగించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి అడ్రస్ లేదని, ఏడాదిలోనే కాంగ్రెస్ పార్టీ ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటుందన్నారు. బీఆర్‌ఎస్‌కు పోటీ చేసే ధైర్యం లేదని, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అభ్యర్థిని నిలబెట్టలేని స్థితిలో ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతామని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఒప్పుకున్నాడన్నారు. బీజేపీ బలపర్చిన టీచర్, పట్టభద్రుదల ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఈటెల రాజేందర్ కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్‌తో ఆట విడుపు

మార్కండేయకాలనీ, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగియగానే సరదాగా ఆట విడుపులో గడిపారు ఎంపీ ఈటెల రాజేందర్. మంగళవారం ఎన్‌టీపీసీ, మంచిర్యాలలో ప్రచారం ముగించుకున్న ఈటెల రాజేందర్ సాయంత్రం 5గంటలకు గోదావరిఖని ఇందిరానగర్‌లో ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగరాజు, మాజీ సైనికుడు నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాక్స్ క్రికెట్‌ను వీక్షించారు. అనంతరం ఎంపీ కొద్దిసేపు క్రికెట్ ఆడారు.


ప్రసంగిస్తున్న ఎంపీ ఈటెల రాజేందర్

మంథని, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల, టీచర్స్ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్యలకు మద్దతుగా చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, చల్లా నారాయణరెడ్డి ప్రచారం నిర్వహించారు. సబ్బని సంతోష్, చిలువేరి సతీష్, నాంపెల్లి రమేష్, బోగోజు శ్రీనివాస్, నారమల్ల కృష్ణలు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యలను గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్‌యాదవ్, సీనియర్ నాయకులు మచ్చగిరి రాము, మట్ట శంకర్ కోరారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ అభ్యర్థుల గెలుపుకోసం కార్యకర్తలు సైనికుల్లాగా పనిచేయాలని సూచించారు. అజయ్, వడ్లకొండ తిరుపతి, బర్ల సదయ్య, పెద్దపల్లి శ్యామ్, పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు వేయాలని పట్టభద్రులను, టీచర్లను కోరారు. గుడిపాటి సంతోష్‌రెడ్డి, ఐలన్న, వేల్పుల ఓదెలు, సంకెండ్ల నర్సయ్య, చిలుక తిరుపతి, ఇంజపూరి సోని, పలువురు పాల్గొన్నారు.

నోట్ల కట్టలతో వచ్చే వారిని నమ్మకండి

గోదావరిఖని, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నోట్ల కట్టలతో వచ్చే విద్యా వ్యాపారులను పట్టభద్రులు నమ్మి మోసపోవద్దని పట్టభద్రుల అభ్యర్థి రవీందర్‌సింగ్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఇద్దరు అభ్యర్థులు విద్య, పుస్తకాల వ్యాపారం చేస్తూ స్వలాభం కోసమే ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని విమర్శించారు. కన్నూరి సతీష్, తిరుమల, మహేష్, షేక్ ఇంతియాజ్, రాజు, శ్రీనివాస్, వెంకటేష్, రాము, కోడి రామకృష్ణ, వెంకన్న, రామరాజు, కొర్రి ఓదెలు పాల్గొన్నారు.

సమస్యలపై నేరుగా సంప్రదించండి

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల కోసం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చెప్పారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. ప్రజల సమస్యలను విన్న ఎమ్మెల్యే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఎవరైనా సమస్యలుంటే తనను నేరుగా కలువాలని ఆయన సూచించారు.

ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయాలి

మంథని, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ సూచించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవంలో ఏసీపీ మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశలను నిలబెట్టడానికి కష్ట పడి చదవాలన్నారు. సెల్ ఫోన్లలో మంచికి బదులు చెడు ఎక్కువగా వినియోగిస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం, మాజీ ప్రిన్సిపాల్ అంబరీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యువెల్లరీ షాప్ యజమానుల పరారీ

మంథని, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెండు జ్యువెల్లరి షాప్స్ నిర్వహిస్తున్న ఓ కుటుంబం కొద్ది రోజులుగా కనిపించకపోవడం పోవడం పై ప్రజల్లో చర్చ కొనసాగుతోంది. వ్యాపార కూడలిలో 20 ఏళ్ళుగా షాప్స్ నిర్వహిస్తున్న ఓ కుటుంబం కొద్ది రోజులుగా కనిపించక పోవడం, సెల్‌ఫోన్లు పని చేయక పోవడం పై ప్రజల్లో చర్చనీయాంశమైంది. వారు ఇక్కడి నుంచి వెళ్ళి పోయారా..లేక ఏదైనా టూర్ వెళ్లారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా ఎవరు ఫిర్యాదు చేయలేదని, ఇంటి ఓనర్ మాత్రం తనకు రెంట్ ఇవ్వకుండా కనిపించకుండ పోయారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఓసీపీ-2 కార్మికుల ఔదార్యం

రామగిరి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3 డివిజన్ ఓసిపి-2 కార్మికులు బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తోటి కార్మికుడి మనవడి కోసం రూ.లక్ష విరాళం మంగళవారం అందజేశారు. కనుకుంట్ల అశ్రిత్(7) సంవత్సరాల బాలుడు బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడికి అత్యవసర చికిత్స నిమిత్తం రూ.15 లక్షలు వెచ్చించాల్సి ఉండగా ఇది తెలుసుకున్న తోటి కార్మికులు వివిధ విభాగాల ఉద్యోగులు, కార్మికుల వద్ద నుంచి రూ. లక్ష సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. శశికుమార్, ఎంఆర్‌సి రెడ్డి, రామిడ్ల మనోహర్, జనార్దన్, రామస్వామి, సదానందం, రవిశంకర్, రాయమల్లు, అరుణ్‌కుమార్, బండ సమ్మయ్య, పిడుగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కోలిండియా అథ్లెట్ మీట్‌లో బంగారు పతకం

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కొత్తగూడెంలో జరిగిన కోలిండియా ఇంటర్ కంపెనీ అథ్లెట్ మీట్‌లో సింగరేణి రామగుండం డివిజన్-1 ఓసీపీ ఈపీ ఆపరేటర్ వెంకట తిరుపతిరెడ్డి ప్రతిభ కనపర్చి బంగారుపతకం సాధించాడు. సింగరేణి సంస్థ తరుపున వెంకటతిరుపతిరెడ్డి సైక్లింగ్‌లో పాల్గొని ప్రతిభ కనపర్చాడు.



గోల్డ్‌మెడల్ అందుకున్న వెంకట తిరుపతిరెడ్డి

కోలిండియా ఇంటర్ కంపెనీ అథ్లెట్ మీట్ సైక్లింగ్‌లో గోల్డ్‌మెడల్ రావడం మొదటిసారి. వెంకటతిరుపతిరెడ్డి బంగారుపతకం సాధించడంపై సింగరేణి ఆర్‌జీ-1 అధికారులు, తోటి కార్మికులు అభినందనలు తెలిపారు.

ఆదాయ పన్ను ప్రణాళికలపై సదస్సు

గోదావరిఖని, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు ఆదాయపన్ను ప్రణాళికలపై, ఐసీఐసీఐ బ్యాంక్ ట్యాక్స్ ప్లానింగ్‌పై మంగళవారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్ హాజరై సింగరేణి ఉద్యోగుల ఆదాయపు పన్ను మినహాయింపు ప్లానింగ్ ఏ విధంగా చేసుకోవాలో వివరించారు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్‌లను అనుసరించి పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయాన్ని తగ్గించడానికి జీతం, ఆదాయంపై పన్ను మినహాయింపులను, పాత పన్ను, కొత్త పన్ను విధానంలో భేదాలను వివరించారు. డీజీఎం(పర్సనల్) కిరణ్ బాబు, డీజీఎం(ఫైనాన్స్) ధనలక్ష్మిభాయి, సీనియర్ పీఓ హనుమంతరావు, సారంగపాణి, ఐసీఐసీఐ బ్యాంక్ జోనల్ హెడ్ సతీష్ పాల్‌రెడ్డి, రీజినల్ హెడ్ రవీందర్‌రావు, బ్రాంచ్ మేనేజర్ హస్సేన్, సీపీ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

కాల్వశ్రీరాంపూర్,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): దాసరి మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో కేక్‌కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ సంపత్‌యాదవ్, నాయకులు రవీందర్‌రెడ్డి, నిదానపురం దేవయ్య, జెట్టి దేవయ్య, పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కుమార్‌యాదవ్, బుర్ర మంగసదానందం, దేవయ్య, గోడుగు మల్లేష్ ఉన్నారు.

పెద్దపల్లి రూరల్: మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్‌లు, బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓదెల: మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి జన్మదినాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేకులను కట్ చేశారు. మల్లికార్జున స్వామి ఆలయంలో అర్చనలు నిర్వహించారు. రమేష్, సతీష్, మొగిలి ఐలయ్య, ఐరెడ్డి వెంకటరెడ్డి, రాచర్ల కుమార్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని అంబేడ్కర్‌చౌక్‌లో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ శ్రేణులు నిర్వహించారు. కేక్‌కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బైరెడ్డి రాంరెడ్డి, స్రవంతిమోహన్‌రావు, పోచయ్య, కవ్వంపల్లి బాపయ్య, నారాయణ, బాసంపల్లి రాజేష్, వినోద్, బద్దం తిరుపతిరెడ్డి, తంగెళ్ల కుమార్, సతీష్‌యాదవ్, రాములు తదితరులు పాల్గొన్నారు.